5

సాక్షి
వికారాబాద్

మంగళవారం । 28 । నవంబర్ । 2023



కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల పేదలకు మేలు జరుగుతుందని ఆ పార్టీ తాండూరు అసెంబ్లీ అభ్యర్థి మనోహర్‌రెడ్డి అన్నారు. 6లో▸

న్యూస్‌రీల్

బీజేపీ క్రమశిక్షణ కలిగిన పార్టీ

నాందేడ్ ఎమ్మెల్యే అజీజ్



మాట్లాడుతున్న నాందేడ్ ఎమ్మెల్యే అజీజ్

కుల్కచర్ల: బీజేపీ క్రమశిక్షణ గల పార్టీ అని, కార్యకర్తలే పార్టీకి కొండంత బలమని నాందేడ్ ఎమ్మెల్యే అజీజ్ అన్నారు. సోమవారం కుల్కచర్లలో మండల పరిధిలోని పోలింగ్ బూత్ ఇన్‌చార్జులు, శక్తికేంద్రాల ఇన్‌చార్జులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బీజేపీ దేశం కోసం, ధర్మం కోసం కృషి చేసే పార్టీ అని అన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేస్తారే తప్ప ఎలాంటి స్వార్థ రాజకీయాలకు తావివ్వని గొప్ప వ్యక్తులని కొనియాడారు. మరో రెండు రోజులు కష్టపడి పరిగి అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఘనపురం వెంకటయ్య గౌడ్, కుల్కచర్ల మండల మండల అధ్యక్షుడు మైపాల్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు గుడాల వెంకటయ్య పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కోసం ఆందోళన

షాద్‌నగర్: ఎన్నికల్లో ఓటు వేసేందుకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో పలువురు ఉపాధ్యాయులు సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు కల్పించాలని ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసుకున్నా జాబితాలో తమ పేర్లు లేకపోవడం దారుణమని అన్నారు. ఈ విషయమై అధికారులను ఎన్ని సార్లు కలిసినా వారు సరైన సమాధానం చెప్పడం లేదని వారు వాపోయారు.

ఉల్లంఘిస్తే ఉపేక్షించం

ఎన్నికల కోడ్‌ను విధిగా పాటించాల్సిందే

- వదంతులను ప్రచారం చేయొద్దు
- ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రక్రియ దాదాపు పూర్తి
- నేటి సాయంత్రం 5గంటలకు ప్రచారం ముగించాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్: ''పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశాం.. ఎన్నికలు సజావుగా జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి.. కోడ్ ఉల్లంఘిస్తే ఉపేక్షించబోం'' అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి స్పష్టం చేశారు. పోలింగ్ ఏర్పాట్లపై సోమవారం కలెక్టరేట్‌లో ఎస్పీ కోటిరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో 1,133 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 29వ తేదీ సిబ్బందికి పోలింగ్ సామగ్రి అందజేస్తామని, అదే రోజు వారు కేటాయించిన కేంద్రాలకు వెళ్లి ఏజెంట్లను నియమించుకోవాలని ఆదేశించారు. 30వ తేదీ ఉదయం 5.30 నుంచి 7గంటల వరకు ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తారని, అనంతరం పోలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. అవసరం మేరకు ఈవీఎంలు, ఈవీ ప్యాట్‌లు అందుబాటులో ఉంచామన్నారు. ఒక వేళ ఈవీఎంలు పని చేయకపోతే 15 నిమిషాల్లో మార్చేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు వివరించారు.

అభ్యర్థులు ఓటరు స్లిప్పులు పంచరాదు

జిల్లాలో ఇప్పటికే ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి కావచ్చిందని, రాజకీయ పార్టీల నాయకులు ఓటరు స్లిప్పులు పంచరాదని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే వారు ఓటరు ఐడీతోపాటు ఎన్నికల సంఘం సూచించిన 13 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి చూపి ఓటు వేయవచ్చని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించమని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ఒక్కో నియోజకవర్గంలో తొమ్మిది ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు విధులు నిర్వహిస్తున్నాయని, వీటి సంఖ్యను



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి చిత్రంలో ఎస్పీ కోటిరెడ్డి

రెట్టింపు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

సీ – విజిల్‌కు ఫిర్యాదు చేయండి

ఎన్నికల కోడ్‌ను ఎవరూ ఉల్లంఘించినా ఉపేక్షించబోమని కలెక్టర్ హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే సీ – విజిల్ యాప్ లేదా డయల్ 1950కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు చేపడతామని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మద్యం, డబ్బు పంపిణీ చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. 29, 30వ తేదీల్లో ఎవరైనా ప్రకటనలు ఇవ్వాల్సి వస్తే ముందస్తు అనుమతులు పొందాలన్నారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఇంటర్వ్యూలు, డిబెట్లు, ఒపీనియన్ పోల్స్, విశ్లేషణ వంటివి చేయకూడదని ఆదేశించారు. దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు తామే వాహన సదుపాయం కల్పిస్తామని తెలిపారు. 29వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేసేందుకు అవకాశం ఉందన్నారు. ఇప్పటి వరకు 8,128 పోస్టల్ బ్యాలెట్లు పంపిణీ చేయగా 3,912 మంది ఓటు వేశారని తెలిపారు.

144 సెక్షన్ అమలు చేస్తాం

జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. కేంద్రాల వద్ద ఓట్లు అడగటం, గుర్తులు చూపడం, గుంపులు గుంపులుగా ఉండటం చేయరాదని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా నిఘా పెంచామన్నారు. 555 లోకేషన్లు గుర్తించి మరింత నిఘా ఏర్పాటు చేశామన్నారు. 84 రూట్లు గుర్తించి ఒక్కో వాహనంలో ముగ్గురు సాయుధ పోలీసులతో 84 టీంలతో నిఘా పెడుతున్నామని వివరించారు. 2,500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాకు ఆరు కంపెనీల కేంద్ర బలగాలు వచ్చాయన్నారు. వారితో కలిసి స్థానిక పోలీసులు సమన్వయంతో విధులు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు నిర్వహించిన తనిఖీల్లో రూ.4.15 కోట్ల నగదు, 4వేల లీటర్ల మద్యం, 24కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. జిల్లాలో 243 లైసెన్స్‌డ్ వెపన్స్ ఉండగా, అత్యవసర సేవలకు మినహాయింపు ఇచ్చి మిగిలిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం 5గంటల తరువాత ప్రచారం చేయరాదని ఆదేశించారు. ప్రచారం కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు వారివారి ప్రాంతాలకు వెళ్లిపోవాలని సూచించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి

పరిగి: కౌంటింగ్ కేంద్రాల ముఖ్య కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం పరిగి మార్కెట్ యార్డులోని కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల కౌంటింగ్‌ను పరిగి మార్కెట్ యార్డులో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. ఎన్నికల సిబ్బంది వాహనాలు పార్కింగ్ కోసం స్థలం కేటాయించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మీడియా పాయింట్, టెలిఫోన్, ఫ్యాక్స్ సదుపాయాలను త్వరితగతిన ఏర్పాట్లు చేయాలని బీఎస్ఎన్ఎల్ అధికారులకు సూచించారు. నీటి సరఫరా, మరుగుదొడ్ల సౌకర్యం ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం క్రికెట్ మినీ స్టేడియంలోని స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. 29వ తేదీ ఉదయం నుంచి ఎన్నికల సామగ్రి పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు ఆకాశ్, ఠాకూర్ తాప, ఎస్పీ కోటిరెడ్డి, ఆర్డీఓ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డిని ప్రియాంకా గాంధీకి పరిచయం చేస్తున్న రేవంత్‌రెడ్డి

కేసీఆర్‌ను గద్దె దింపండి

- రేవంత్‌లో నిజాయితీ ఉంది
- బంపర్ మెజారిటీతో గెలిపించాలి
- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ

కొడంగల్: అవినీతి, అక్రమాలతో ప్రజా ధనాన్ని లూటీ చేస్తున్న కేసీఆర్‌ను గద్దె దింపాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం నియోజకవర్గ పరిధిలోని కోస్గిలో విజయభేరి బహిరంగ సభను నిర్వహించారు. ప్రజలను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ప్రజలకు మేలు జరుగుతుందని సోనియా గాంధీ రాష్ట్రాన్ని ప్రకటించారని పేర్కొన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో ఏర్పడిన తెలంగాణలో కేసీఆర్ కుటుంబ పాలక సాగుతోందని విమర్శించారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి రేవంత్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. రేవంత్‌లో నిజాయితీ ఉందన్నారు. ఆయనతో మొదటి సారి మాట్లాడిన సమయంలో తెలంగాణలో మార్పు తీసుకొస్తానని అన్నారని చెప్పారు. తనకు పదవులు కావాలని కోరలేదన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందని, ఆ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం వచ్చిందన్నారు. ఫాంహౌస్‌కు పరిమితమైన కేసీఆర్‌ను అక్కడే ఉంచాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇస్తామని ప్రకటించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. వృద్ధులకు పింఛను మొత్తం పెంచుతామన్నారు. సకల జనులు ఉద్యమం చేస్తేనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. కేసీఆర్ ఒక్కడి వల్ల తెలంగాణ రాలేదన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ కుటుంబం అవినీతి, అక్రమాలతో ప్రజల ధనాన్ని లూటీ చేస్తోందన్నారు. ఏ ఆశయ సాధన కోసం తెలంగాణ ఏర్పడిందో అది అమలు కాలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. అనంతరం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తల తెగిపడినా తల వంచేది లేదన్నారు. తెలంగాణలో కేసీఆర్ అరాచక పాలనకు ముగింపు పలకాల్సిన సమయం వచ్చిందన్నారు. కొడంగల్‌కు తీరని అన్యాయం చేసిన కేసీఆర్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో పరిగి, తాండూరు కాంగ్రెస్ అభ్యర్థులు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ విజయభేరి సభకు హాజరైన జనం

సింగిల్‌గానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న జైరాం రమేశ్

- భారత్ జోడో యాత్రతో కాంగ్రెస్‌కు ఆదరణ పెరిగింది
- బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం ఒక్కటే
- సీడబ్ల్యూసీ మెంబర్, కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్

అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో కేసీఆర్ వారంటీ ఖతమయ్యిందని సీడబ్ల్యూసీ మెంబర్, కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్ అన్నారు. సోమవారం వికారాబాద్‌లో మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. పూర్తి మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలు కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకు బీఆర్ఎస్ 9 ఏళ్ల నమ్మక ద్రోహానికి మధ్య పోటీ అన్నారు. ప్రజలు కేసీఆర్‌ను ఇంటికి పంపడం ఖాయమన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం ఒక్కటేనని ఆరోపించారు. రాహుల్‌గాంధీ జోడో యాత్రతో కాంగ్రెస్‌కు ప్రజాదరణ పెరిగిందన్నారు. కర్ణాటక ఎన్నికల ఫలితాలు తెలంగాణలోనూ పునరావృతం అవుతాయని స్పష్టం చేశారు. కేసీఆర్ పాలనలో సామాజిక న్యాయం ఎక్కడుందని ఆయన ప్రశ్నించారు. ఫాంహౌస్‌కే పరిమితమై ప్రజల సమస్యలను గాలికొదిలేశారని మండిపడ్డారు. సమావేశంలో పార్టీ జాతీయ అధికార ప్రతినిధి షమా మహ్మద్, పార్లమెంట్ ఇన్‌చార్జ్ విష్ణుప్రసాద్, యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోష్, సీనియర్ నాయకులు సత్యనారాయణ, కిషన్ నాయక్, రత్నారెడ్డి, బస్వరాజు, నర్సింలు, పెండ్యాల అనంతయ్య, జాఫర్, గురువారెడ్డి, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడే ఆఖరు..



సాయంత్రం 5గంటలకు ముగియనున్న ప్రచారం

- చివరి రోజు కావడంతో మరింత పదును పెట్టిన పార్టీలు
- ఎస్ఎంఎస్‌లు, ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

వికారాబాద్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రంతో పరిసమాప్తం కానుంది. రెండు నెలలుగా హోరెత్తిన మైకులు మూగబోనున్నాయి. బహిరంగ సభలు, రోడ్ షోలు, సమావేశాలకు ముగింపు పడనుంది. ఈ నెల 10న నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో అభ్యర్థులు ప్రచారాన్ని పరుగులు పెట్టించారు. రెండు నెలలుగా నాయకులు జనంలో ఉంటూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. బీఆర్ఎస్ అధిష్టానం జిల్లాలోని తాండూరు, పరిగి, కొడంగల్, వికారాబాద్ స్థానాలకు సిట్టింగులకే టికెట్లు ప్రకటించగా, మిగిలిన పార్టీలు మాత్రం నామినేషన్ల ప్రారంభ సమయంలో టికెట్లు కేటాయించాయి. దీంతో అన్ని పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తించాయి. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందే ప్రచారాన్ని ముగించాల్సి ఉంది. మంగళవారం సాయంత్రం 5గంటల తరువాత అభ్యర్థులు, పార్టీల నాయకులు బహిరంగ, అంతర్గతంగా గానీ ప్రచారం చేసుకోవడానికి వీలుండదు.

ఓటరును ప్రసన్నం చేసుకునేందుకు..

నేటితో ప్రచారం ముగియనుండటంతో పార్టీలు, అభ్యర్థులు కొత్త తరహా ప్రచారానికి ప్లాన్ చేసుకుంటున్నారు. మైకులు, కండువాలు, గ్రూపులుగా వెళ్లడం, సభలు, సమావేశాలు, ర్యాలీలకు తెరపడనుంది. ఈ నేపథ్యంలో మిగిలిన 48 గంటల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వినూత్న ప్రచారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలు తమకు అవసరమైన మేరకు మద్యం కొనుగోలు చేసి రహస్య ప్రదేశాల్లో డంప్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో ఓటర్లను కొనుగోలు చేసేందుకు డబ్బులు సైతం సిద్ధంగా ఉంచుకున్నట్లు ఆయా పార్టీల నేతలు చర్చించుకుంటున్నారు. మాస్ ప్రచారానికి ఆస్కారం లేకపోవడంతో యువజన సంఘాలు, కుల సంఘాలు, క్రికెట్ అసోసియేషన్లు ఇలా గ్రూపులుగా ఉన్న వారికి గుర్తించి వారికి మర్యాదలు చేస్తున్నారు. మద్యం, ఇష్టమైన భోజనాలతో విందులు ఏర్పాటు చేస్తున్నారు. ఎలాగైనా వారిని మచ్చిక చేసుకుని ఓట్లు వేయించుకోవాలనే లక్ష్యంతో అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్‌లు పోటీ పడుతున్నాయి.

నిఘా పెంచిన పోలీసులు

ఇప్పటికే అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లాలో 17 చెక్ పోస్టులు ఏర్పాటు చేసిన పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. వీటితో పాటు ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలను సైతం ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. ఇక ఎన్నికల పర్వం చివరి ఘట్టానికి చేరుకోవడంతో జిల్లా పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. డబ్బు, మద్యం పంపకాలను నిలువరించడమే లక్ష్యంగా వారు పావులు కదుపుతున్నారు. అబ్జర్వర్లు, పోలీసు ఉన్నతాధికారులు సైతం డేగ కన్నుతో తనిఖీలను పర్యవేక్షిస్తున్నారు. అంతేకాకుండా సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అదనపు పోలీసు బలగాలను తరలిస్తున్నారు. అయితే ఎన్నికల చివరి రెండు రోజులు ఎస్ఎంఎస్‌లు చేసేవారు, యాడ్స్ ఇచ్చేవారు తప్పనిసరిగా ఎన్నికల అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

క్లుప్తంగా

సమయం లేదు మిత్రమా..

నేటి సాయంత్రం

5 గంటలకు అన్నీ బంద్‌



తాండూరు: రెండు నెలలుగా హోరాహోరీగా సాగిన ప్రచారానికి నేడు తెరపడనుంది. మైక్‌ల గోల, డప్పు చప్పుళ్లు. ఇంటింటి ప్రచారం మంగళవారం సాయంత్రం 5 గంటలకు ముగుస్తుంది. ఇన్ని రోజులు కాళ్లకు బలపం కట్టుకుని పరుగులు పెట్టిన అభ్యర్థులు.. చివరి రోజు వీలైనంత మందిని కలిసేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నారు. ఇదే క్రమంలో ఓటర్లను తమవైపు తిప్పుసుకునేందుకు ప్రలోభాలకు తెర తీస్తున్నారు. తాండూరులో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ పార్టీలు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నాయి. ఆఖరి రోజు కావడంతో ఎన్నికల ప్రచారాన్ని ఉదయం నుంచే నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. నువ్వా.. నేనా అన్నట్లుగా ప్రధాన పార్టీల అభ్యర్థులు తెలపడుతున్నారు. బీఆర్‌ఎస్‌ పార్టీ అభ్యర్థి రోహిత్‌రెడ్డి చివరి రోజు తాండూరు పట్టణంతో పాటు అన్ని మండలాలను చుట్టేసేందుకు రెడీ అవుతున్నారు. ముందుగా ఆయన తన సొంత మండలమైన బషీరాబాద్‌ మండల కేంద్రంలో బైక్‌ ర్యాలీతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వీలైనన్ని గ్రామాల్లో ప్రచారం చేయాలని పూనుకున్నారు.

కాంగ్రెస్‌లో నూతనోత్సాహం

కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి మనోహర్‌రెడ్డి చివరి రోజు ఎన్నికల ప్రచారంతో ప్రజల్లో జోష్‌ పెంచాలని భావిస్తున్నారు. అందుకోసం పార్టీలోని కీలక నేతలు ప్రచార బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే తాండూరు నియోజకవర్గంలో నిర్వహించిన సభలు, సమావేశాలు విజయవంతం కావడంతో నూతనోత్సాహంతో ఆయనదూసుకుపోతున్నారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇప్పటికే అన్ని మండలాల్లో కలియతిరగాలని నిర్ణయం తీసుకొని ముందుకు సాగుతున్నారు.

గ్రామాల నుంచి కదలొద్దు

అసెంబ్లీ ఎన్నికల చివరాంకంలో నాయకులు, కార్యకర్తలు గ్రామాలు, మున్సిపల్‌ వార్డులు విడిచి బయటకు వెళ్లొద్దని ప్రధాన పార్టీల నేతలు హుకుం జారీ చేశారు. పట్టణంలోని వార్డు, బూత్‌ ఇన్‌చార్జిలు, మండల నాయకులు, గ్రామ స్థాయి నాయకులంతా ఎవరి గ్రామాల్లో వారు ఉండాలని అభ్యర్థులు ఆదేశాలు జారీ చేశారు. సమయం లేదు మిత్రమా అంటూ హడావిడి చేస్తున్నారు. మరోవైపు పోలింగ్‌కు మరో 50 గంటలు మాత్రమే సమయం ఉండటంతో అభ్యర్థుల్లో టెన్షన్‌ నెలకొంది.

మీ బిడ్డను గెలిపించండి

బీఆర్‌ఎస్‌ మహేశ్వరం అభ్యర్థి సబితారెడ్డి

మీర్‌పేట: 'మహేశ్వరం నా ఇళ్లు'.. మీ ఇంటి ఆడబిడ్డనైన నన్ను ఆశీర్వదించి గెలిపించాలని బీఆర్‌ఎస్‌ అభ్యర్థి సబితారెడ్డి ప్రజలను కోరారు. ప్రచారంలో భాగంగా సోమవారం మీర్‌పేట కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో దాసరి నారాయణరావునగర్‌, కమలానెహ్రూనగర్‌, మీర్‌పేట కూడలి వరకు రోడ్‌షో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ 24 గంటల విద్యుత్‌, నల్లా ద్వారా ఇంటింటికి మంచినీరు, కల్యాణలక్ష్మి, రైతుబంధు, దళితబంధు, డబుల్‌ బెడ్‌రూం ఇళ్లు వంటి ప్రతిష్టాత్మకమైన పథకాలను అమలు చేస్తూ ఆదర్శంగా నిలిచారని గుర్తుచేశారు. ఇప్పుడు ఓట్ల కోసం వస్తున్న బీజేపీ, కాంగ్రెస్‌ వాళ్లు గతంలో ఈ ప్రాంతంలో వరదలప్పుడు, కరోనా కష్టకాలంలో కనపడలేదన్నారు. కార్యక్రమంలో మేయర్‌ దుర్గ, డిప్యూటీ మేయర్‌ విక్రంరెడ్డి, కార్పొరేటర్లు అనిల్‌యాదవ్‌, సిద్దాల బీరప్ప, ధనలక్ష్మి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే బీసీలకు న్యాయం

పార్టీ ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్‌

మంచాల: బీజేపీతోనే బీసీలకు న్యాయం చేకూరుతుందని పార్టీ ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్‌ ఈటల రాజేందర్‌ అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని లోయపల్లిలో పార్టీ అభ్యర్థి నోముల దయానంద్‌కు మద్దతుగా రోడ్‌ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే పనులు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం తామే చేసినట్లు చెప్పుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువత బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు.

కొడంగల్‌లో ఏం జరుగుతోంది?

- పట్టు సడలించిన 'పట్నం' బ్రదర్స్‌
- గులాజీ శ్రేణుల్లో భవిష్యత్తుపై గుబులు
- ఒక్కొక్కరుగా జారుకుంటున్న నేతలు



కొడంగల్‌: కొడంగల్‌లో బీఆర్‌ఎస్‌ పరిస్థితిపై ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఆందోళన చెందుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి టీఆర్‌ఎస్‌ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డి గెలుపు కోసం తీవ్రంగా శ్రమించిన కార్యకర్తలు, నాయకులు.. అధిష్టానం పిలుపును సీరియస్‌గా తీసుకుని గత ఎన్నికల్లో రేవంత్‌ను ఓడించారు. కానీ ప్రస్తుతం ఆ పట్టుదల ఎక్కడా కనిపించడం లేదు. పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ పలు మీటింగ్‌లలో మాట్లాడుతూ.. కొడంగల్‌లో రేవంత్‌ ఓటమి ఖాయమని చెబుతున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ సైతం కోస్గి ప్రజా ఆశీర్వాద సభలో ఇదే విషయాన్ని స్పష్టంచేశారు. నరేందర్‌రెడ్డిని గెలిపిస్తే ప్రమోషన్‌ ఇస్తానని సీఎం స్వయంగా ప్రకటించినా.. పట్నం బ్రదర్స్‌ ఈ విషయాన్ని అంత సీరియస్‌గా తీసుకోవడం లేదని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. అసలు కొడంగల్‌లో గులాబీ పార్టీకి ఏమైందనే..? చర్చ సర్వత్రా సాగుతోంది. కాంగ్రెస్‌ అభ్యర్థి రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో లేకపోయినా ఆయన తరఫున పార్టీ శ్రేణులు జోరుగా ప్రచారం చేస్తున్నాయి. వీరికి అవసరమైన సదుపాయాలను సమకూర్చేందుకు పక్కా ఏర్పాట్లు చేయడంతో ఎక్కడా లోటుపాట్లు కనిపించడం లేదు. కానీ నరేందర్‌రెడ్డి స్వయంగా ప్రచారం చేస్తున్నా శ్రేణుల్లో మునుపటి జోష్‌ లేదు. కొడంగల్‌లో విజయం తనదేనని రేవంత్‌ నమ్మకంతో ఉన్నారు. నిత్యం ప్రజల్లో ఉండే నరేందర్‌రెడ్డి, మంత్రి మహేందర్‌రెడ్డి అస్త్ర సన్యాసం చేశారా..? అని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల తర్వాత తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించుకుంటున్నారు. ఈ మధ్యకాలంలో తమ కార్యకర్తలపై పలు కేసులు నమోదైనా ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి పట్టించుకోలేదనే ఆరోపణలు వెల్లువెత్తాయి.

కారు దిగి.. హస్తం వైపు

మంత్రి మహేందర్‌రెడ్డి కొడంగల్‌ నియోజకవర్గంలో పర్యటిస్తూ మండల స్థాయి నాయకులను కలుస్తున్నారు. ఆయన వెళ్లిన రెండుమూడు రోజుల్లోనే సదరు నేతలు పార్టీ మారుతున్నారు. ఇలా ఎందుకు జరుగుతుందో ఎవరికీ అంతు పట్టడం లేదు. మరోవైపు మహేందర్‌రెడ్డి పాత నియోజకవర్గమైన తాండూరులోనూ ఆయన అనుచరులుగా కొనసాగిన వారంతా ప్రస్తుతం హస్తం గూటికి చేరారు. దీంతో ఏం జరుగుతుందో తెలియక గులాబీ శ్రేణులు తల పట్టుకుంటున్నాయి. మద్దూరు మండలంలో సీనియర్‌ నాయకుడు మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణరెడ్డితో పాటు పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో చేరారు. కోస్గిలో మున్సిపల్‌ వైస్‌ చైర్‌పర్సన్‌ అన్నపూర్ణ, ఆమె భర్త హరి, కోస్గి పీఏసీఎస్‌ చైర్మన్‌ భీంరెడ్డితో పాటు పలువురు సర్పంచులు హస్తం పార్టీకి జైకొట్టారు. దీంతో కోస్గి మున్సిపల్‌ పాలకవర్గం మైనార్టీలో పడింది. ఎన్నికల తర్వాత ఏ క్షణమైనా ఇక్కడ అవిశ్వాసం పెట్టే అవకాశం ఉందని కౌన్సిలర్లు చెబుతున్నారు. కొడంగల్‌లో మున్సిపల్‌ చైర్మన్‌ జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ శివకుమార్‌ గుప్తతో పాటు పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. దౌల్తాబాద్‌, బొంరాస్‌పేట మండలాల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. 30లోపు కొడంగల్‌ మండలంలోని మరికొందరు సర్పంచులు కాంగ్రెస్‌ గూటికి వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా పట్నం సోదరులు ఎందుకు స్పందించడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారంలో ఉండి కూడా పట్టించుకోకపోవడం పట్ల బీఆర్‌ఎస్‌ అధిష్టానం దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

హరీశ్‌ రాక జోష్‌ నింపేనా?

నియోజకవర్గంలోని మద్దూరు మండలానికి మంగళవారం మధ్యాహ్నం మంత్రి హరీశ్‌రావు రానున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలో జరిగే రోడ్‌షోలో ఆయన పాల్గొంటారు. అయితే చతికిలబడిన కేడర్‌లో ఆయన పర్యటన జోష్‌ నింపుతుందా చూడాలి.

బీఆర్‌ఎస్‌ కార్యాలయం వద్ద ఉద్రిక్తత



చెన్నారెడ్డి విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

- డబ్బులు పంచుతున్నారని కాంగ్రెస్‌ ఆరోపణ
- ఓటమి భయంతో దాడికి యత్నించారన్న బీఆర్‌ఎస్‌

వికారాబాద్‌ అర్బన్‌: వికారాబాద్‌ బీఆర్‌ఎస్‌ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. సోమవారం రాత్రి 8:30 గంటల సమయంలో బీఆర్‌ఎస్‌ కార్యాలయంలో పెద్ద ఎత్తున డబ్బులు పంపిణీ చేస్తున్నారనే సమాచారంతో కాంగ్రెస్‌ పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యాలయంలోకి చొచ్చుకెళ్లారు. ఆ సమయంలో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి ఆనంద్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు అక్కడే ఉన్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని కాంగ్రెస్‌ నాయకులను బయటకు పంపించారు. కార్యాలయం నుంచి చెన్నారెడ్డి విగ్రహం వరకు బీఆర్‌ఎస్‌ శ్రేణులు ర్యాలీ తీశారు. కాంగ్రెస్‌ నాయకులను అరెస్టు చేయాలని ఆందోళనకు దిగేందుకు యత్నించారు. పోలీసులు సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు. బీఆర్‌ఎస్‌ ఆఫీస్‌లో బహిరంగంగా డబ్బులు పంచుతున్నా పోలీసులు పట్టించుకోలేదని కాంగ్రెస్‌ నాయకులు ఆరోపించారు.

ఎవరూ ఆవేశపడొద్దు

కాంగ్రెస్‌ పార్టీ నాయకుల ఆందోళనను ఆనంద్‌ ఖండించారు. పార్టీ కార్యకర్తలు సహనం కోల్పోవద్దని సూచించారు. కాంగ్రెస్‌ అభ్యర్థి ప్రసాద్‌కుమార్‌ అనుచరులతో దాడికి యత్నించారని, ఓటమిని జీర్ణించుకోలేకనే దాడులకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు.

'కారు'కు బ్రేక్‌ వేస్తాం.. కాంగ్రెస్‌కే ఓటేస్తాం

ధారూరు: తమ భూములను లాక్కుంటున్న కారు పార్టీకి బ్రేక్‌ వేసి.. హస్తం గుర్తుకు ఓటేసి కాంగ్రెస్‌ అభ్యర్థి ప్రసాద్‌కుమార్‌ను గెలిపిస్తామని ధారూరు మండల పరిధిలోని రాంపూర్‌తండా వాసులు ప్రతిజ్ఞ చేశారు. గిరిజన నాయకులు రాఘవన్‌నాయక్‌, రాంపూర్‌తండా సర్పంచ్‌ పాండునాయక్‌, కాంగ్రెస్‌ నాయకుడు రాజేందర్‌ సోమవారం గట్టెపల్లి, రాంపూర్‌తండాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవన్‌నాయక్‌ మాట్లాడుతూ.. రాంపూర్‌తండాకు చెందిన పలువురికి 600 ఎకరాలకు పట్టాలిస్తే.. 72 ఎకరాలను రెండు కంపెనీలకు బీఆర్‌ఎస్‌ నాయకులు కట్టబెట్టారని మండిపడ్డారు. భూములను లాక్కుంటున్న నాయకులకు బుద్ధి చెప్పి.. కాంగ్రెస్‌ అభ్యర్థి గెలిపించాలని అభ్యర్థించారు.

మోమిన్‌కలాన్‌లో..

హస్తం గుర్తుకు ఓటేయాలని ముస్లిం నాయకులు ఓటర్లను కోరారు. మండల పరిధిలోని మోమిన్‌కలాన్‌, నాగారం గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్‌, మైనార్టీ రుణాలు, ఉద్యోగ కల్పనలో సీఎం కేసీఆర్‌ మోసం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షరీఫ్‌, మోసీన్‌ఖురేషి, ఇస్మాయిల్‌, జహీర్‌, ఆజాం, అన్సర్‌, మజీద్‌ పాల్గొన్నారు.

ప్రచార హోరు

శివయ్య మీద ఆన... 'ఆరు గ్యారెంటీ'



హస్తం గుర్తుకు ఓటేసి తనను గెలిపిస్తే కాంగ్రెస్‌ ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో పాటుగా తాను నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ఖచ్చితంగా నెరవేరుస్తానని డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్‌ పరిగి అసెంబ్లీ అభ్యర్థి టి.రామ్మోహన్‌రెడ్డి బాండ్‌పేపర్‌పై అఫిడవిట్‌ రాసిచ్చారు. సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రమాణం చేశారు. - పరిగి

ఎడ్లబండిపై ఎన్నికల ప్రచారం



కాంగ్రెస్‌ వికారాబాద్‌ అభ్యర్థి సోమవారం పట్లూర్‌, మర్పల్లిలో రోడ్‌ షో నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఆయన ఎడ్లబండిపై ఎన్నికల ప్రచారం చేపట్టి ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. - మర్పల్లి

శ్రీరాముడి సాక్షిగా..



కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని పార్టీ చేవెళ్ల నియోజకవర్గ అభ్యర్థి పామెన భీంభరత్‌ ప్రజల సమక్షంలో అఫిడవిట్‌ రాసిచ్చారు. సీతారాంపూర్‌లో సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రమాణం చేశారు. - షాబాద్‌

కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు



మార్కెట్‌లో పూల వ్యాపారులను కలసి తనకు ఓటు వేయాలని కోరుతున్న మనోహర్‌రెడ్డి

- యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తా
- తాండూరు అభ్యర్థి మనోహర్‌రెడ్డి

తాండూరు: కాంగ్రెస్‌ అధికారంలో ఉంటేనే అన్ని వర్గాల పేదలకు మేలు జరుగుతుందని ఆ పార్టీ తాండూరు అసెంబ్లీ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం తాండూరులోని అయ్యప్ప స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్‌ నాయకుడు డాక్టర్‌ సంపత్‌ కుమార్‌తో కలిసి బస్వణ్ణకట్ట, భద్రేశ్వర్‌ చౌక్‌, కూరగాయల మార్కెట్‌లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను వివరిస్తూ చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాండూరును అభివృద్ధి చేయడంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ధ్వంసమైన రోడ్లు కనిపిస్తున్నాయని, గ్రామాలు మురుగు కాలువలకు నోచుకోలేదని విమర్శించారు. వందల కోట్లతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే ఇంటి చుట్టు మాత్రమే అభివృద్ధి జరిగిందన్నారు. తనను గెలిపిస్తే ఎన్‌టీఆర్‌ కాలనీ, రాజీవ్‌ కాలనీల్లో రోడ్లు, మురుగు కాలువలు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్‌ను నమ్మితే బానిస బతుకులు తప్పవని హెచ్చరించారు. కాంగ్రెస్‌ అధికారంలోకి రాగానే ఇచ్చిన గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్‌ లింగదల్లి రవి, నాయకులు మసూద్‌ తదితరులు పాల్గొన్నారు.

కారు.. హుషారు

షాద్‌నగర్‌/షాద్‌నగర్‌రూరల్‌/చేవెళ్ల: ఎన్నికల ప్రచారంలో భాగంగా షాద్‌నగర్‌, చేవెళ్లలో సోమవారం చేపట్టిన బీఆర్‌ఎస్‌ ప్రజా ఆశీర్వాద సభలు విజయవంతమయ్యాయి. రెండు నియోజకవర్గాల్లోని ఆయా మండలాల నుంచి భారీగా జన సమీకరణ చేపట్టారు.ఇటు షాద్‌నగర్‌ పట్టణంలోని మహబూబ్‌నగర్‌ రోడ్డులో ఉన్న యాగశాల..అటు చేవెళ్లలోని ఫరా కళాశాల మైదానం జనంతో నిండిపోయాయి. సభాప్రాంగణాలు గులాబీమయం అయ్యాయి. జై కేసీఆర్‌ నినాదాలు మిన్నంటాయి. షాద్‌నగర్‌లో పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌, చేవెళ్లలో పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలె యాదయ్య తరఫున సీఎం కేసీఆర్‌ ప్రచారం నిర్వహించారు.

షాద్‌నగర్‌,చేవెళ్లలో బీఆర్‌ఎస్‌ ప్రజా ఆశీర్వాద సభలు

- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, ప్రజలు
- గులాబీమయమైన సభా ప్రాంగణాలు
- హోరెత్తించిన పాటలు.. కార్యకర్తల స్టెప్పులు
- తన ప్రసంగాలతో జోష్‌ నింపిన సీఎం కేసీఆర్‌

ఆకట్టుకున్న ఆటాపాట

- షాద్‌నగర్‌లో 'గులాబీల జెండలే రామక్క.. గుర్తుల గుర్తుంచుకో రామక్క.. కారును గుర్తుంచుకో రామక్క' అని పాడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలోని తాండ్ర గ్రామానికి చెందిన గాయకులు కొమ్ము లక్ష్మమ్మ, బొల్లె సుశీల, శాంతమ్మ, కలమ్మ, అనసూయ ఆకట్టుకున్నారు.
- చేవెళ్లలో ధూంధాం పాటలు అలరించాయి. గులాబీల జెండలే పాట మధుప్రియ పాడుతుంటే ఎమ్మెల్యే కాలె యాదయ్య నృత్యం చేస్తూ సభకు వచ్చినవారిని ఉత్తేజపరిచారు.

అంజయ్య యాదవ్‌ వజ్రపు తునక

షాద్‌నగర్‌ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ వజ్రపు తునకలాంటి మనిషి, ఎవరికీ హానీ తలపెట్టని వ్యక్తి.. ఇలాంటివారు చాలా తక్కువగా ఉంటారు.. నియోజకవర్గం అభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేస్తున్నాడని సీఎం కేసీఆర్‌ సభలో కొనియాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి తన వెంట నమ్మిన బంటులా ఉన్నాడని అన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ పథకాలు మరింత ముందుకు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో అంజయ్య యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కాలె యాదయ్య సాయం చేసే మనసున్నోడు

చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య చీమకు, దోమకు కూడా నష్టం చేసే వ్యక్తి కాదు. అవసరమైతే సహాయం చేస్తాడే కాని నష్టం మాత్రం ఎవరికీ చేయడని ముఖ్యమంత్రి కేసీఆర్‌ అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికోసం నిరంతరం తపిస్తాడు. అందరికీ నేను ఆర్డర్‌ చేస్తే.. యాదయ్య నన్ను ఆర్డర్‌ చేస్తాడు. నా దగ్గరకు రాగానే ఎమ్మెల్యే సాబ్‌ ఏం ఆర్డర్‌ అని అడుగుతాను. ఆయన వచ్చిండంటే నియోజకవర్గానికి ఏదో ఒకటి చేయాలని పట్టుబట్టి తీసుకెళ్తాడు అని గుర్తు చేశారు. నాకు దగ్గరోడు కాబట్టి ఆయన అడిగిన తరువాత కాదనే ముచ్చట ఉండదు.



అంజయ్యయాదవ్‌ ఏం మాట్లాడారంటే..



రాష్ట్రంలో పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్‌ అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు పేదల జీవితాలలో వెలుగులు తెచ్చాయి. గతంలో ఏ ప్రభుత్వాలు కూడా ప్రజల కష్టాలను పట్టించుకున్న పాపాన పోలేదు. అరవై ఏళ్ల పాలనలో ఆగమైన బతుకుల్లో సీఎం కేసీఆర్‌ వెలుగులు నింపారు. బీఆర్‌ఎస్‌ అధికారంలోకి వస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుంది. కాంగ్రెస్‌, బీజేపీ మాయ మాటలు నమ్మొద్దు. 'కారు'కు ఓటేసే బాధ్యత మీది.. ఈ ప్రాంతాభివృద్ధి చేసే బాధ్యత మాది.

చేవెళ్లకు వరాలు

నియోజకవర్గంలోని దళితులందరికీ ఒకే విడత దళితబంధు కావాలని ఎమ్మెల్యే యాదయ్య అడిగాడు అందుకే అందరికీ ఒకే విడతలో దళితబంధు ఇస్తానని కేసీఆర్‌ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గంలో అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న జీఓ 111ను తొలగించాం. చిన్న చిన్న అడ్డంకులు ఉన్నాయి.. మాస్టర్‌ప్లాన్‌ తయారు చేసి ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే పూర్తిగా తొలగించే బాధ్యత తనదన్నారు. త్వరలోనే హైదరాబాద్‌కు దగ్గరగా ఉన్న చేవెళ్లలో మరిన్ని పరిశ్రమలు తీసుకువస్తామన్నారు. పాలమూరు-రంగారెడ్డి నీళ్లు చేవెళ్ల వరకు వస్తాయన్నారు.

పటిష్ట బందోబస్తు

ముఖ్యమంత్రి రాక సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణాన్ని ప్రత్యేక పోలీసులు జాగిలాలతో తనిఖీ చేశారు.

కాలె యాదయ్య ఏమన్నారంటే..



దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి భావితరాలకు తెలిసేలా తయారు చేసిన నాయకుడు, రైతు బాంధవుడు సీఎం కేసీఆర్‌. ఇప్పటికే ఏ ప్రభుత్వాలు చేయలేని విధంగా నియోజకవర్గానికి భారీ పరిశ్రమలు వచ్చేలా చేశారు. ఆయా పరిశ్రమల్లో నేడు వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. గత ఎన్నికల్లో చేవెళ్ల ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఈ ప్రాంత అభివృద్ధికి అడ్డుగా ఉన్న జీఓ 111ను తొలగించినందుకు సంతోషంగా ఉంది.

ఈ ఎన్నిక మన ఆత్మగౌరవ ప్రతీక

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

కొడంగల్‌: ప్రియాంకా గాంధీ పర్యటన నియోజకవర్గ కాంగ్రెస్‌లో కొత్త జోష్‌ను నింపింది. బహిరంగ సభకు వచ్చిన అశేష జనవాహినిని చూసిన నేతలు రేవంత్‌రెడ్డి మెజార్టీపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. కొడంగల్‌ ప్రజల ఆత్మగౌరవానికి బీఆర్‌ఎస్‌ నాయకుల మోసాలకు జరుగుతున్న ఎన్నికలని ప్రజలకు నేతలు వివరించారు. కాగా 1978లో ఇందిరాగాంధీ, 2018లో రాహుల్‌ గాంధీ, 2023లో ప్రియాంకాగాంధీ రావడంపై అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ కుటుంబాన్ని గద్దె దించాలని మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి ప్రజలను కోరారు. 1200 మంది తెలంగాన బిడ్డలు బలిదానం చేసుకుంటే తెలంగాణ వచ్చిందన్నారు. ఉద్యమకారుల ప్రాణాలను పణంగా పెట్టిన కేసీఆర్‌ ముఖ్యమంత్రి అయ్యారని అన్నారు. కేసీఆర్‌ పాలనలో కొడంగల్‌కు తీరని అన్యాయం జరిగిందన్నారు. నవంబర్‌ 30వ తేదిన నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేసి బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలన్నారు.



మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి